క్లుప్తంగా

రేపటి నుంచి పశువైద్య శిబిరాలు

కల్వకుర్తిరూరల్: జాతీయ సేవ పథకంలో భాగంగా డిసెంబర్ 1వ తేదీ నుంచి వారం రోజులపాటు కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు వైద్యాధికారి డా రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కురిమిద్ద, ఎంగంపల్లి, వెల్దండ మండలంలోని కుప్పగల్ల, తెల్లపలుగుతండాలో ప్రారంభమై 7వ తేదీన వంగూరు మండలంలోని మాచినోనిపల్లి గ్రామాల్లో శిబిరాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రత్యేక పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పశువైద్య అధికారి శ్యాంసుందర్ పేర్కొన్నారు. 1న కుప్పగండ్ల, తెల్లపల్లుతండా, 2న కొట్ర, తిమ్మినోనిపల్లి, 4న చొక్కన్నపల్లి, బండోనిపల్లి, భర్కతపల్లి, 6న వెల్దండ, రాచూర్ గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రేపు మాలల సింహగర్జన

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో మాలల సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కలమంద శేఖర్ శుక్రవారం పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు కొల్లాపూర్ నియోజకవర్గంలోని మాలలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

మన్ననూర్: మాలల సింహ గర్జన బహిరంగ సభకు అధికసంఖ్యలో తరలిరావాలని మాల మహానాడు నాయకులు నాసరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం అమ్రాబాద్ మండలం మాచారంలో వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రేణయ్య, రాజలింగం, రాంకోటి, రామకృష్ణ, గోపాల్, మల్లయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

నాగర్‌కర్నూల్‌రూరల్/తాడూరు: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పుల్జాల గ్రామానికి చెందిన మావిల్ల అడివయ్య, మేడిపూర్ గ్రామానికి చెందిన బొల్లె పరశురాములు ప్రమాదవశాత్తు మృతిచెందడంతో ప్రమాదబీమా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను మాజీ ఎమ్మెల్యే అందజేశారు.

ముమ్మరంగా ఆన్‌లైన్ నమోదు

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే చేసిన డేటా ఫామ్స్‌ను ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయంలో 50 మంది ఆపరేటర్లు నమోదు చేయిస్తున్నారు. మండలంలోని 38 గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి సేకరించిన కుటుంబ సర్వే ఫామ్స్‌లో ఉన్న వివరాలన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నమోదు కార్యక్రమాన్ని సూపరింటెంట్ చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో కొనసాగుతోంది.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అచ్చంపేట రూరల్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నీటి పొదుపు అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు భానుప్రియ, ఇందు, అనురాధ, అంజలి, వాణిశ్రీకి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం అర్జునయ్య, ఉపాధ్యాయులు జాఫర్, రవీందర్‌రెడ్డి, బషీర్ అహ్మద్, శ్రీను, శివ, విజయలక్ష్మి, సాజీద్, ప్రవీణ్, ఆర్డీటీ బృందం పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

తాడూరు: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపకుడు వాస రాఘవేందర్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని మేడిపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు సమకూర్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం త్యాగరాజుగౌడ్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఎంఈఓకు ఘన సన్మానం

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో బదిలీ అయిన ఎంఈఓ చంద్రుడికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు పూలమాల, మెమోంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, చల్మారెడ్డి, సుజీవన్‌రెడ్డి, నరహరి, చంద్రశేఖర్, రఘురాంరెడ్డి, సునీల్, బిక్షానాయక్, మల్లేష్, విశ్వేశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



అమ్రాబాద్ కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటయ్య

కల్వకుర్తి టౌన్: వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన శుభ్రమైన ఆహారాన్ని వడ్డించాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని మైనారిటీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను ఆయన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. వంటగదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శివ, మున్సిపల్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

కోడేరు: మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలతో పాటు వివిధ పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం కోడేరులో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బంది జమ్ములయ్య, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: విద్యార్థులకు నాణ్యతలేని భోజనం వడ్డిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ వెంకటయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా కేజీబీవీలో టాయిలెట్లు పరిశీలించి పరిశుభ్రంగా లేవని అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఇంకుడుగుంత తీయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు, స్టాక్ రికార్డులను తనిఖీ చేశారు. భోజనం, కూరగాయలు, బియ్యం, నూనెలను పరిశీలించారు. ఎస్‌ఓ శారద, పీఆర్‌ఏఈ రుక్మంగద ఉన్నారు.

వెల్దండ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల వసతి గృహంలో భోజనాన్ని పరిశీలించారు. వారి వెంట వసతి గృహం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



బాణాలలో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

బల్మూర్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని తుమ్మెన్‌పేట, బాణాల గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన తుమ్మెన్‌పేటలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని పీఏసీఎస్ సిబ్బందికి సూచించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా వరికి రైతులకు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సీడీపీఓ దమయంతి, తహసీల్దార్ శ్రీకాంత్, ఏపీఓ సువర్ణ, ఆర్ఐ శివ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ గిరివర్ధన్‌గౌడ్, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, సంపంగి రవి, నిమ్మల విష్ణు, సుధాకర్‌గౌడ్, తిరుపతిరావు, యాదగిరిరావు, నర్సింగ్‌రావు, ఎల్లికంటి శ్రీను పాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతి



కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేయాలని కోరుతూ ఆర్డీఓ బన్సీలాల్‌కు శుక్రవారం బీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాసు వినతిపత్రం అందజేశారు. మాగనూరులో ఫుడ్‌పాయిజన్ కారణంగా మృతిచెందిన గురుకుల విద్యార్థిని శైలజ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్‌ఐ నియోజకవర్గ అధ్యక్షుడు గణేష్ తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన



కోడేరు: మండలంలో పని చేస్తున్న ఎమ్మార్సీ కాంట్రాక్టు ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బంగారయ్య, సాయికుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు పరిశీలన



మన్ననూర్: గ్రామంలోని అంబేద్కర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను అమ్రాబాద్ ఎంఈఓ బాలకిషన్ శుక్రవారం సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అంతకుముందు వంటశాల పరిసరాలు, భోజనం, కూరగాయలు తనిఖీ చేశారు. ఆయన వెంట ఐఈఆర్పీ రాఘవేందర్, ఉపాధ్యాయులు శిల్ప, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సమయానికి బస్సు నడపాలని..



తెలకపల్లి: సమయానికి బస్సు నడపాలని శుక్రవారం విద్యార్థులు నిరసన తెలిపారు. మండలంలోని గట్టురాయిపాకుల, గట్టునెల్లికుదురు గ్రామాల విద్యార్థులు గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలకు విద్యను అభ్యసించేందుకు వెళ్తుంటారు. ఉదయం నాగర్‌కర్నూల్ నుంచి గట్టురాయిపాకుల మీదుగా తెలకపల్లికి బస్సు సమయానికి వస్తున్న సాయంత్రం సమయానికి రాకపోవడంతో ఆయా గ్రామాల విద్యార్థులు నిరసన తెలిపారు. ప్రతిరోజు గంటపైగా బస్సు ఆలస్యంగా వస్తుదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాత్రివేళ ఇంటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



కల్వకుర్తిరూరల్: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, కల్వకుర్తి సీఐ నాగార్జునలు పేర్కొన్నారు. శుక్రవారం కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళా క్రీడాకారుల ఎంపికకు వారు హాజరై మాట్లాడారు. గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడలతోపాటు చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్, ఎస్ఐ మాధవరెడ్డి, ప్రిన్స్‌పాల్ దమయంతి, వ్యాయామ ఉపాధ్యాయులు అంజయ్య, కోచ్‌లు గణేష్, ప్రకాష్, రామస్‌గౌడ్, రమేష్, భారతి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ

లింగాల: మండలంలోని బాకారం ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు హ్యూమన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతలు వై.సునీల్‌రాజ్, వై.సుజాతరాజ్, దేవదానం సహకారంతో శుక్రవారం స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు శివశంకర్, భాస్కర్, ఉపాధ్యాయురాలు కావ్య, అంగన్‌వాడీ టీచర్ కళావతి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు పండుగ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం రైతు పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, సీఈఓ ఎల్లయ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి దీక్షాదివస్‌లో భాగంగా శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు అమినోద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమ నాయకుడు మాజీ సీఎం కేసీఆర్ అని కొనియాడారు. నాయకులు రాజిరెడ్డి, వెంకటయ్య, శంకర్, అంజి, రవీందర్ పాల్గొన్నారు.

చారకొండ: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షాదివస్ కార్యక్రమానికి మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు రవీందర్, గజ్జె యాదయ్య గౌడ్, సవారి జంగయ్య, వెంకటయ్య, యూత్ ప్రెసిడెంట్ చండీశ్వర్‌గౌడ్ ఉన్నారు.

ధ్యానంతో ప్రశాంతత



కొల్లాపూర్: ధ్యానంతో ప్రశాంతత కలుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 7వ వార్డులో నూతనంగా నిర్మించిన బ్రహ్మకుమారీస్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్యానం వల్ల కలిగే లాభాలను బ్రహ్మకుమారీలు మంత్రికి వివరించారు. భవన నిర్మాణానికి స్థల కేటాయించిన మంత్రి మంత్రికి, మున్సిపల్ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజు, వైస్‌చైర్‌పర్సన్ మహిమూదాబేగం, కౌన్సిలర్ డాక్టర్.రాముడుయాదవ్ తదితరులు ఉన్నారు.

సామాజిక తనిఖీకి ఏర్పాట్లు

పెద్దకొత్తపల్లి: మండలంలో గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు చేపట్టిన జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక తనిఖీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీఓ నాగేందర్ తెలిపారు. మరో రెండు రోజుల్లో తనిఖీ చేయనునట్లు పేర్కొన్నారు. మండలంలో రూ.4 కోట్లతో 324 పనులు చేపట్టినట్లు వీటికి సంబంధించిన ఫైల్స్‌ను సిద్ధంగా ఉంచామని తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కొల్లాపూర్: హన్మకొండలో ఈ నెల 30 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న న్యాయవాదుల మహాసభల పోస్టర్లను శుక్రవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చట్టాలు తీసుకురావాలని వారు కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కర్‌రెడ్డి, ఉపేందర్, వసంతరెడ్డి, శివారెడ్డి, గోవిందు, నిరంజన్, మనోహన్, కురుమూర్తి, బాలస్వామి, రాఘవేంద్ర, నళిని, రేణుక తదితరులు ఉన్నారు.

ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక ఎస్టీయూ భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ మురళి అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర నాయకుడు పర్వత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులకు ఇంటర్నల్ మార్కులు రద్దు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో రమేష్, సతీష్, కరుణాకర్‌రెడ్డి, మద్దిలేటి, రమేష్, హనుమంతు, ప్రభాకర్, మధుసూదన్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యాశాఖ మంత్రిని నియమించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం ఉమ్మడి నాయకులు కాళ్ల నిరంజన్ పాల్గొని మాట్లాడారు. ఫుడ్ పాయిజన్ కారణంగా మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు కుంభం మల్లేష్‌గౌడ్, నిరంజన్‌యాదవ్, గంగోజి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ పాఠశాలలకు నాణ్యమైన బియ్యం అందించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి పరశురాములు కోరారు. శుక్రవారం పట్టణంలోని విద్యానగర్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేశారు. జగన్, శేఖర్, చంద్రయ్య, పురుషోత్తం, డేవిడ్ పాల్గొన్నారు.

ముక్కిన బియ్యం.. పురుగుల అన్నం



భోజనం కోసం ఉపయోగిస్తున్న ముక్కిపోయి పురుగుల పట్టిన బియ్యం

బల్మూర్: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఉన్నతాధికారులు పేర్కొంటున్నా కొన్నిచోట్ల అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడటం లేదు. సంబంధిత అధికారులు, హెచ్‌ఎంలు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పలు జిల్లాల్లో ఫుడ్‌పాయిజన్ కారణంగా విద్యార్థులు ఆస్పత్రి పాలవుతున్నా మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, ఉపాధ్యాయుల్లో మార్పు రావడం లేదు. శుక్రవారం బల్మూరు మండలం మైలారం ప్రాథమిక పాఠశాలలో ముక్కిన బియ్యంతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు వడ్డించారు. హెడ్‌మాస్టర్, వంట మనిషి నిర్లక్ష్యంగా పాత ముక్కిపోయిన పురుగులు పట్టిన బియ్యంతోనే విద్యార్థులకు భోజనం తయారుచేశారు. ఈ విషయంపై హెచ్‌ఎంను వివరణ అడగగా మాకు రేషన్ షాప్ నుంచి ఇవే బియ్యం వచ్చాయని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. అదేవిధంగా ఇన్‌చార్జ్ ఎంఈఓ వివరణ కోరగా ముక్కిన బియ్యంతో కూడిన భోజనం వడ్డించడంతో హెచ్‌ఎం రాజేశ్వరికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

రైతు బాంధవుడు సీఎం రేవంత్‌రెడ్డి

తాడూరు: రైతు బాంధవుడు సీఎం రేవంత్‌రెడ్డి అని సింగిల్‌విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కార్యాలయ ఆవరణలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్న వడ్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ. 500 లు బోనస్ ఇస్తుందన్నారు. ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతు పండుగ మహాసభకు ఆయా గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఈఈఓ శివ, సిబ్బంది సురేష్, కృష్ణ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పరీక్షలకు భయపడొద్దు

నాగర్‌కర్నూల్‌రూరల్: పరీక్షలకు భయపడొద్దని ప్రముఖ సైకాలజిస్ట్ బి శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అంతటి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో ఉన్నతమైన ప్రతిభ ఎలా కనబర్చాలో వివరించారు. పాఠ్యాంశాలు బోధించేటప్పుడు ఏకాగ్రతతో వినాలని సూచించారు. ఒత్తిడిని ఎలా అధిగమించాలో తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు శంషోద్దీన్, గుడిపల్లి నిరంజన్, వెంకటేష్, సందీప్, హైమావతి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై ఆరా

కొల్లాపూర్: పట్టణంలో ప్రభుత్వ పీజీ కళాశాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి శుక్రవారం ఆర్ఐడీ స్వర్ణోత్సవాలకు హాజరయ్యేందుకు వస్తుండగా మార్గమధ్యలో పీజీ సెంటర్‌ను సందర్శించారు. కళాశాల విద్యార్థులతో మౌలిక వసతుల గూర్చి తెలుసుకున్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్ తోపాటు అధ్యాపకులు ఉన్నారు.

నలుగురికి రిమాండ్

అమ్రాబాద్: ఓ కుటుంబంపై దాడి చేసిన ఘటనలో నలుగురు రిమాండ్, ముగ్గురికి షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. ఏఎస్ఐ బాలునాయక్ తెలిపిన వివరాల ప్రకారం పదర మండలం ఉడిమిళ్లలో ఓ యువతి ఇతర కులం చెందిన యువకుడితో వెళ్లిందని యువతి కుటుంబ సభ్యులు స్వామి, హన్మంతు, వెంకట్రాం, శంకర్‌లతో పాటు మరో ముగ్గురు మహిళలు అదే గ్రామానికి చెందిన యువకుడు ఎనుపోతులకృష్ణయ్య ఇంటి మీద దాడి చేసి ట్రాక్టర్‌ను ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 27న మొత్తం పదకొండు మందిపై కేసు నమోదు చేశారు. శుక్రవారం ఏడు మందిని పట్టుకొని అచ్చంపేట కోర్టులో హాజరుపర్చారు. నలుగురికి 14 రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. ఈ మేరకు నిందితులకు కల్వకుర్తికి జైలుకు తరలించారు. మిగతా ముగ్గురు మహిళలకు షరతులతో కూడిన బెయిల్ లభించిందని ఏఎస్ఐ బాలునాయక్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



వెల్దండ: మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారి కావడంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి రోజు వాహనాల తనిఖీ చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి తదితరులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ గ్రామానికి చెందిన పత్యతో పాటు తెలకపల్లి మండలం కార్వంగకు చెందిన కుర్మయ్యకు రెండు రోజుల పాటు జైలు శిక్ష, రూ.100ల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెల 30న ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ పాటిస్తునట్లు ఎస్‌ఎఫ్ఐ జిల్లా కారదర్శి ఎం తారాసింగ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బంద్ నిర్వహిస్తునట్లు పాఠశాలల నిర్వాహకులు సహకరించాలని కోరారు. కార్తీక్, తరుణ్, సుల్తాన్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: కేసు నమోదు

వెల్దండ: మండలంలోని ఎర్రవల్లితండాకు చెందిన రాంపాల్‌నాయక్ శుక్రవారం అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. యజమానికి రిమాండ్ తరలిస్తామని ఎస్ఐ తెలిపారు.

రైతు పండుగను..

లింగాల: రైతు పండుగను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మండల ఇన్‌చార్జ్ రంగినేని శ్రీనివాస్‌రావు కోరారు. మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించే సీఎం సభకు అధికసంఖ్యలో తరలిరావాలన్నారు. మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిమాండ్‌కు తరలింపు

వెల్దండ: మండల కేంద్రంలో ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో కిడ్నాప్ చేసిన యువకుడిపై ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్ చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన పాటి తేజకుమార్ హైదరాబాద్‌లో బైక్‌షోరూంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 24న మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి బాలికను కిడ్నాప్ చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా హైదరాబాదులో ఉన్న తేజకుమార్‌ను, బాలికను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. శుక్రవారం యువకుడిపై ఫోక్సో , ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మైనర్ బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

ముందస్తు అరెస్టు

తిమ్మాజిపేట: సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ అమిస్తాపూర్‌లో రైతు పండుగకు శుక్రవారం హాజరకానుండటంతో ముందస్తుగా శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులను అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ మాజీ అధ్యక్షుడు దాచేపల్లి వేణుగోపాల్, నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు గణితం టాలెంట్ టెస్ట్



తెలకపల్లిలో విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత టాలెంట్ టెస్టు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ప్రతిభ కనబర్చిన వారు డిసెంబర్ 11న కల్వకుర్తిలో జిల్లా స్థాయి పోటీలో పాల్గొననున్నారు. ఆయా మండలాల్లో ఎంఈఓలు పర్యవేక్షించారు. పలు పాఠశాలల ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు.

ఆర్థికసాయం అందజేత



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ శేఖర్ యాదవ్ ఇటీవల మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న బీజేపీ జిల్లా నాయకుడు గుర్రాల రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. బండెల రామచంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకటేష్‌యాదవ్, సురేందర్, బాబిదేవ్, దామోదర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.